ఒకటో తేదీ నుంచి భూ బాదుడు

- క్లాసిఫికేషన్ వారీగా కొత్త ధరలు
- 50 శాతం వరకు పెంపునకు సిద్ధం
- పైకి 20 శాతమంటూ మాటలు
- డిసెంబర్ నుంచి కొత్త ధరలు
- నివేదిక సిద్ధం చేస్తున్న అధికారులు



నగరంలో డాక్యుమెంట్ రైటర్ల దుకాణాలు ఉండే వీధి

చిత్తూరు కార్పొరేషన్: ప్రభుత్వం డిసెంబర్ నుంచి భూముల ధరలు పెంచడానికి సిద్ధమైంది. ఇదే అదునుగా భావించిన కూటమి నాయకులు తాము చెప్పిన ప్రాంతంలో ధరలు పెంచాలని అధికారులను ఆదేశిస్తున్నారు. కుటుంబ భద్రత కోసం ప్రతి ఒకరికీ సొంతిల్లు లేదా స్థలం కొనుగోలు చేయాలనేది కల. బంగారం తాకట్టుపెట్టి, చిట్స్, అప్పు చేసి వాటిని తీర్చుకుంటున్నారు. ఏటా ఆగస్టులో పెంచాల్సిన భూముల ధరలను ఈసారి డిసెంబర్‌లో ప్రభుత్వం పెంచనుంది. అధికారం వచ్చిన కొత్తలో ఉద్యోగుల బదిలీలపై దృష్టి పెట్టారు. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో భూ ధరలు పెంచితే చెడ్డపేరు వస్తుందని భావించి ఈ అంశాన్ని కొద్దిరోజులు పక్కన పెట్టారు. క్లాసిఫికేషన్ వారీగా చూస్తే 50 శాతం వరకు ధరలు పెంచేందుకు అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. పైకి మాత్రం 10–20 శాతం మాత్రమే ధరలు పెంచుతున్నామని అధికారులు చెప్పి కవర్ చేస్తున్నారు.

క్లాసిఫికేషన్‌లో మార్పులు

ప్రస్తుతం ప్రాంతాల వారీగా భూధరలు ఉన్నాయి.



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

ఇక అలా కాకుండా ఉన్న క్లాసిఫికేషన్‌లో మార్పులు చేయడానికి సిద్ధమయ్యారు. అంటే ప్రస్తుతం ఒక ప్రాంతంలో చదరపు అడుగు రూ.2 వేలు అనుకుందాం .. ఇదే క్లాసిఫికేషన్‌లో మార్పులు చేస్తే ప్రాంతం రోడ్డు పక్కన ఒక ధర, చివరిలో ఒక ధర ఉంటుంది. అప్పుడు ప్రవేశం, రోడ్డు పక్కన, దిక్కుల వారీగా అడుగు రూ.3000–రూ.5000 వరకు పెరుగుతుంది. అదే విధంగా వ్యవసాయ భూమి మెట్ట భూమి కింద ఎకరాను పరిగణిస్తున్నారు. అలా కాకుండా మెట్ట, మాగాణి చొప్పున ఇక లెక్క కట్టనున్నారు. అంటే ఒక ఉన్న భూమిని మెట్ట, మాగాణిగా నిర్ణయించి వేరుగా విలువలు నిర్ణయిస్తారు. ఇక హైవే, వాణిజ్య దుకాణాలు, రవాణా సదుపాయం ఉన్న భూములను బట్టి ధరలు పెంచనున్నారు. దాదాపు శ్లాబ్ విధానం తరహాలో రిజిస్ట్రేషన్ ధరలు పెంచేలా ప్రభుత్వం కసరత్తు మొదలెట్టింది.

ఆదాయంపై దృష్టి

జిల్లాలో చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్, కార్వేటి నగరం, బంగారుపాళ్యం, పలమనేరు, పుంగనూరు, కుప్పం, నగరిలో కలిపి మొత్తం 8 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటి పరంగా ప్రస్తుతం ఉన్న భూ విలువలను ఇక సవరించనున్నారు. జిల్లాలో చదరపు అడుగు రూ.56–రూ.5,800 వరకు ఉంది. గుడిపాల మండలం కొత్తపల్లెలో చదరపు అడుగు రూ.56 కాగా నగరంలోని బజారువీధిలో, కుప్పంలో రూ.5,000కు పైగా విలువ ఉంది. ఇక పొలం పరంగా ఎకరా రూ.1.50 లక్షల నుంచి రూ.1.09 కోట్ల వరకు ఉంది. చిత్తూరు రూరల్ మండలంలోని అనగల్లులో రూ.1.50 లక్షలు, నగరిలో రూ.1.09 కోట్లు ఎకరా ఉంది. పట్టణ, గ్రామీణ, గృహావసరాలు, వాణిజ్య, పారిశ్రామిక ఇలా ప్రాంతాల వారీగా పెంచడానికి ప్రభుత్వం సిద్ధమైంది. సాధారణంగా ప్రభుత్వ విలువ కన్నా బహిరంగ మార్కెట్‌లో 3 రెట్లు అధికంగా ఉంటుంది. ప్రస్తుతం ఎకరా భూమి కోటి రూపాయలు అనుకుంటే వాటిపై మరో 30 శాతం పెంచితే అప్పుడు బహిరంగ మార్కెట్లో వాటి విలువ రూ.4 కోట్లు పలుకుతోంది. ఎక్కువగా వాణిజ్య ప్రాంతాల పరంగా మరింత ధరలను పెంచనున్నారు. జిల్లాలో ప్రస్తుతం జాతీయ రహదారుల పనులు జరుగుతున్నాయి. దీంతో అన్ని ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. దీంతో అన్ని ప్రాంతాల్లో ధరలు పెంచాలని చూస్తున్నారు.

పలు అంశాలు బేరీజు

ఒక ప్రాంతంలో ధరలు పెంచాలంటే పలు అంశాలను అధికారులు బేరీజు చేసుకుంటారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల సంఖ్య, వచ్చిన దుకాణాలు, రోడ్లు, కనీస వసతులు, రవాణా సౌకర్యాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. తదుపరి తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓ, జెడ్పీ సీఈఓతోపాటు జేసీలకు నివేదిక అందజేస్తారు. కలెక్టర్ వాటిని ఆమోదించక రిజిస్ట్రేషన్‌శాఖ ఐజీకి పంపుతారు. వాటిలో మార్పు చేసే అధికారం ఆయనకు ఉంటుంది. పెంచిన ధరలను ప్రతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రదర్శించాల్సి ఉంది.

క్లుప్తంగా

నేడు పాలకలలో ‘ఫ్యామిలీ డాక్టర్’

ఐరాల: మండలంలోని పాలకల రెడ్డివారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు వెల్లడించారు. దీర్ఘకాలిక రోగులకు వైద్య పరీక్షలు చేయనున్నట్లు వివరించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీఆర్ ఎస్ఈ పేరు మార్చండి సారూ



పీఆర్ కార్యాలయంలోని నేమ్ బోర్డులో ఎస్ఈగా కే.చంద్రశేఖర్‌రెడ్డి పేరు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పంచాయతీరాజ్ (పీఆర్) ఎస్ఈలు బదిలీ అయి కొత్తవారు వచ్చినా కార్యాలయం వద్ద పాత అధికారి పేరు అలాగే దర్శనమిస్తోంది. గతంలో ఎస్ఈగా ఉన్న కే.చంద్రశేఖర్‌రెడ్డి కడపకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శంకర్‌నారాయణ బాధ్యతలు చేపట్టి పదిరోజుల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. తర్వాత చిత్తూరు పీఆర్ ఈఈ ఈ.చంద్రశేఖర్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన సైతం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయం వద్ద గతంలో ఎస్ఈగా ఉన్న కే.చంద్రశేఖర్‌రెడ్డి పేరును మార్చకుండా అలానే ఉంచారు. అధికారులు మారిన పేరు మార్చకపోవడమేమిటని పలువురు అనుకుంటున్నారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయవచ్చని వెల్లడించారు.

‘శాలివాహన’ సమావేశం



సమావేశానికి వచ్చిన సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆదివారం శాలివాహన కులస్తుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ్యత్వ ఎంపిక, కమ్యూనిటీ హాల్ భవనం, కాణిపాకంలో సత్రం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, నియోజకవర్గాల కార్యవర్గ నియామకం తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిశేషయ్య నేతృత్వంలో చర్చించారు. సమావేశంలో అడ్వకేట్ దామోదరం, కమిటీ సభ్యులు కె.దేవరాజులు, మల్లయ్య, సీహెచ్ రత్నశేఖర్, ఉదయ్ కుమార్, వెంకటేశ్వర్లు, నాగరాజు, దామోదరం హరి, చలపతి, బాలాజీ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన



జబీన్‌కు జ్ఞాపిక అందిస్తున్న వేదిక సభ్యులు

బంగారుపాళెం: సైబర్ క్రైమ్‌పై పోలీసులు ఇటీవల నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో ప్రతిభను కనబరిచిన సెయింట్ మేరీ ఉన్నత పాఠశాల విద్యార్థిని జబీన్‌ను ముస్లిం ఐక్యవేదిక నియోజకవర్గ అధ్యక్షుడు ఫిరోజ్‌అహ్మద్ అభినందించారు. ఆదివారం ఈ మేరకు వేదిక ఆధ్వర్యంలో విద్యార్థినిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వేదిక ఉపాధ్యక్షుడు బాబు, నేతలు ఉమ్మర్, జిలాన్, చందులాల్, దిలీప్, గౌస్, అల్తాఫ్, సెయింట్ మేరీ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లో పేరుకుపోయిన నిర్లక్ష్యం



తుప్పపట్టిన విద్యుత్‌పరికరాలు

చిత్తూరు కార్పొరేషన్: గిరింపేటలోని ట్రాన్స్‌కో 220 కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ అధ్వానంగా మారింది. పిచ్చిమొక్కలతో నిండిపోయింది. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ సబ్‌స్టేషన్ నుంచి చిత్తూరు నియోజకవర్గం, తవణంపల్లె మండలం, యాదమరి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. 60 ఏళ్లుగా ఇక్కడి నుంచి 130, 33 కేవీ సబ్‌స్టేషన్ల ద్వారా విద్యుత్‌ను సరఫరాను అందిస్తున్నారు. ఇంత పరిధి ఉన్న సబ్‌స్టేషన్ నిర్వహణను అధికారులు గాలికొదిలేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. సబ్‌స్టేషన్ ప్రవేశం నుంచి ఎక్కడ చూసినా చెట్ల తీగలు అల్లుకుని భయానకంగా కనిపిస్తున్నాయి. పాత ఇనుప విద్యుత్ పరికరాలను అక్కడే వేశారు. వాటిలో విషపురుగులు చేరుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు శివాలయాల్లో కార్తీక పూజలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో సోమవారం కార్తీక పూజలను ఘనంగా నిర్వహించనున్నారు. ప్రధానంగా కట్టమంచిలోని కుళందీశ్వర ఆలయం, ఈశ్వరగుడివీధిలోని అగస్తీశ్వరస్వామి ఆలయం, ఇరువారంలోని నాగేశ్వర ఆలయం, నీవానది ఒడ్డున ఉన్న రాజుగుడిలో కార్తీక పూజలు వైభవంగా జరగనున్నాయి. భక్తులు పెద్దసంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో ఆయా ఆలయాల నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమానికి అన్ని శాఖల మండల అధికారులు హాజరవుతారని వివరించారు.

నేటి నుంచి భగవత్ వైభవంపై ప్రవచనం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో సోమ, మంగళవారాల్లో శ్రీనారాయణి సేవా సమితి ఆధ్వర్యంలో భగవత్ వైభవంపై ప్రవచనాల కార్యక్రమం ఉంటుందని నిర్వాహకుడు కల్యాణ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వైభవంపై రాధా మనోహర్ దాస్ ప్రసంగించనున్నట్లు వెల్లడించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ప్రవచన కార్యక్రమం ఉంటుదని వివరించారు.

హైస్కూల్ ప్లస్ కళాశాలలను బలోపేతం చేయండి



మాట్లాడుతున్న జయప్రకాశ్ నాయుడు

చిత్తూరు కలెక్టరేట్: హైస్కూల్ ప్లస్ కళాశాలలను బలోపేతం చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జయప్రకాశ్ నాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఆ సంఘం నాయకులు ఆదివారం హైస్కూల్ ప్లస్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ టీచర్లతో డీఈవో కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హైస్కూల్ ప్లస్ పేరును జిల్లా పరిషత్ జూనియర్ కళాశాలగా మార్చాలన్నారు. ఇంటర్మీడియట్‌లో ముఖ్యమైన గ్రూపులు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సులను బోధించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి కాలేజీలోనూ స్టాఫ్ ప్యాటర్న్‌ను అమలు చేయాలని, ప్రతి హైస్కూల్ ప్లస్ కాలేజీని కో ఎడ్యుకేషన్‌గా మార్పు చేయాలన్నారు. ప్రధాన కార్యదర్శి రామయ్య మాట్లాడుతూ ప్రతి ఉన్నత పాఠశాలకు అందిస్తున్న స్టూడెంట్ కిట్‌లో పాటు అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని హైస్కూల్ ప్లస్‌లో చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పీజీటీలను శాశ్వత నియామకం చేసి జూనియర్ లెక్చరర్‌గా కేడర్‌ను మార్పు చేయాలన్నారు. సమావేశంలో పీజీటీలు దామోదర్‌రెడ్డి, రెడ్డిరమేష్‌బాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యతిరేక విధానాలు మానుకోవాలి



రాష్ట్ర మహా సభల కరపత్రాలు విడుదల చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

- ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్
- విజయనగరంలో 27 నుంచి 49వ రాష్ట్ర మహాసభలు

చిత్తూరు కలెక్టరేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలను మానుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం ఆ పార్టీ నాయకులతో కలిసి పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల వద్ద 49వ రాష్ట్ర మహా సభల కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ విజయనగరంలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయకరణకు వ్యతిరేకంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి ఉద్యమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విద్యను పూర్తిగా కాషాయీకరణ చేసేందుకు జాతీయ నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చిందని విమర్శించారు. దీనివల్ల ఇప్పటికే రాష్ట్రంలో అనేక విద్యాసంస్థలు మూతపడ్డాయన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని దుయ్యబట్టారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలును వెంటనే చేపట్టాలన్నారు. అనంతరం 23 మంది సభ్యులతో ఏఐఎస్ఎఫ్ చిత్తూరు నగర కమిటీని ఎన్నుకున్నారు. నగర అధ్యక్షులుగా యామిని, కార్యదర్శిగా బాలాజీ నాయక్, ఉపాధ్యక్షులుగా మనిధర్, ప్రేమనాథ్, కుప్పయ్య, సహాయ కార్యదర్శులుగా నవ్య, మోనిషా, పల్లవి, సాయికుమార్ ఎన్నికయ్యారు. మున్నా, చైతన్య తదితరులు పాల్గొన్నారు.


జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం



మాట్లాడుతున్న యూనియన్ సభ్యులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) నిరంతరం పోరాడుతోందని ఆ సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు లోకనాథం, కార్యదర్శి మురళీకృష్ణ తెలిపారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏపీయూడబ్ల్యూజే నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఏపీయూడబ్ల్యూజే బలోపేతంతోపాటు చిత్తూరులో కార్యాలయాన్ని నిర్మించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కె.ఎం అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు మురహరిరెడ్డి, శివ, జాయింట్ సెక్రటరీ ఇషార్ అహ్మద్, కోటీశ్వర్ యాదవ్, చంద్రమోహన్, కార్యవర్గ సభ్యులు సురేష్, జగన్నాథం, జీవన్, ఖాన్, వెంకటేశులు, గోవిందస్వామి, రమేష్, ఉదయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రవచనం.. పరిపూర్ణం



మాట్లాడుతున్న గరికిపాటి నరసింహారావు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): భూత, భవిష్యత్ గురించి ఆలోచించవద్దని గరికిపాటి నరసింహారావు తెలిపారు. చిత్తూరు నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన యోగావసిష్ఠంపై ప్రవచన కార్యక్రమం ఆదివారంతో పరిపూర్ణమైంది. గరికపాటి మాట్లాడుతూ విచిత్రమైన ఆలోచనలే ఆరోగ్యాన్ని, మనసును పాడు చేస్తాయన్నారు. పనిని శ్రద్ధగా చేస్తూ ముందుగా వెళ్లాలని సూచించారు. అనంతరం ఆయనను నిర్వాహకుడు కల్యాణ్ ఘనంగా సన్మానించారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

26న కలెక్టరేట్ల వద్ద ధర్నా



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య

చిత్తూరు కార్పొరేషన్: దేశవ్యాప్తంగా రైతులు, కార్మిక వ్యతిరేక విధానాలను కొనసాగిస్తున్న నిరంకుశ మోదీ ప్రభుత్వానికి కళ్లు తెరిపించేందుకు ఈ నెల 26న అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య పిలుపునిచ్చారు. చిత్తూరులో ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మిక, రైతు సంఘాల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోదీ అంబానీ, అదానీ జపం చేస్తూ గుజరాతీ కార్పొరేట్ సంస్థలకు ప్రజా ధనాన్ని దోచిపెట్టడం దుర్మార్గమన్నారు. బ్యాంకింగ్ రంగంలో కార్పొరేట్‌దారుల బకాయిలు రూ.15 లక్షల కోట్లు రద్దు చేశారని విమర్శించారు. రైతుల రుణాలను దౌర్జన్యంగా వసూలు చేయడం సరికాదన్నారు. ఢిల్లీలో రైతులు ఉద్యమించిన సమయంలో క్షమాపణ చెప్పారని, తిరిగి దొడ్డిదారిన ఆ చట్టాలను తీసుకొచ్చేందుకు మోదీ పూనుకుంటున్నారని తెలిపారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తామని హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టి.జనార్ధన్, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు ఎస్.నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అవలంబిస్తున్న రైతులు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా 26న కలెక్టరేట్‌ను దిగ్బంధనం చేస్తామన్నారు. జిల్లాలో మామిడి, పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, విజయ డెయిరీ, చక్కర ఫ్యాక్టరీని పునః ప్రారంభించాలని ఉద్యమం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేంద్ర, ఓబుల్‌రాజు, దాసరిచంద్ర, రమాదేవి, విజయ్‌గౌరి, దామోదరం సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం.. జ్ఞానంతో ముక్తి





మాట్లాడుతున్న పిరమిడ్ మాస్టర్ శ్రీహరికృష్ణ, హాజరైన ప్రజలు

తవణంపల్లె: ధ్యానం తద్వారా జ్ఞానంతోనే ముక్తి లభిస్తుందని హైదరాబాద్‌కు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ శ్రీహరికృష్ణ తెలిపారు. మండలంలోని శ్రీవిఘ్నేశ్వర పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో మూడు రోజులు పాటు నిర్వహించిన ఆత్మజ్ఞాన సదస్సు ఆదివారంతో ముగిసింది. శ్రీహరికృష్ణ మాట్లాడుతూ భూలోకం ఒక విశాలమైన పాఠశాలన్నారు. అందులో మనం చేసిన కర్మలు, తప్పులను సరిదిద్దుకోవడానికే జన్మలు ఉంటాయని వివరించారు. గత జన్మలో చేసిన పాపకర్మలకు ఇప్పుడు రోగాల రూపంలో, చేసిన పుణ్య కర్మలకు భోగాల రూపంలో అనుభవిస్తామని వెల్లడించారు. మన జీవితాన్ని తీర్చిదిద్దుకునే సువర్ణ అవకాశమే ధ్యానమని తెలిపారు. మాస్టర్ పార్వతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా పిరమిడ్ సొసైటీ, గ్లోబల్ ట్రస్టు వ్యవస్థాపకుడు డాక్టర్ బి.గోపాలకృష్ణమూర్తి, కన్వీనర్ రాధిక పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతికి కూటమి గండి

- ప్యూరిఫికేషన్ పేరుతో డ్వాక్రా సభ్యుల సమాచారం సేకరణ
- వార్షికాదాయం ఎక్కువగా ఉన్న వారికి పథకాలు కట్
- ఆందోళన చెందుతున్న మహిళలు




సమావేశమైన మహిళా సంఘాల సభ్యులు(ఫైల్)

గుడిపాల: మహిళా సాధికారతకు పట్టం కడతామంటూ ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కూటమి పెద్దలు అధికారం చేపట్టిన తర్వాత తీరు మార్చుకున్నారు. తాము చెప్పినట్లు చేయాలని మహిళలపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ముఖ్యంగా వారికి బలవంతంగా టీడీపీ సభ్యత్వాన్ని అంటగడుతున్నారు. తాజాగా సంఘాల్లోని మహిళల కుటుంబ సభ్యుల వివరాలు, ఆర్థిక సమాచారం, తదితర విషయాలను తెలుసుకొనేందుకు ఎస్‌హెచ్‌జీ ప్యూరిఫికేషన్ పేరుతో సరికొత్త కుట్రకు తెరలేపారు. ఈ నెల 8 నుంచి 30వ తేదీలోపు సంఘాల సభ్యుల వివరాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లో పొందుపర్చనున్నారు. ఈ ప్రక్రియ పూర్తికాగానే ఇప్పటి వరకు సదరు మహిళలకు అందుతున్న ప్రభుత్వ పథకాలకు ఎసరు పడే అవకాశం లేకపోలేదని డీఆర్‌డీఏ వర్గాలు అంటున్నాయి.

ప్యూరిఫికేషన్ పేరిట బురిడీ


పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల/స్లమ్ సమాఖ్యల పటిష్టత పేరుతో ప్యూరిఫికేషన్ కార్యక్రమానికి కూటమి సర్కార్ తెరలేపింది. సంఘాలు, సభ్యుల సమగ్ర వివరాలను సేకరించనున్నారు. 2007లో గ్రూపులు ఏర్పడ్డాయని, అప్పటి నుంచి ప్యూరిఫికేషన్ చేపట్టలేదని, మరణించిన వారు, వలస వెళ్లిన వారు, యాక్టివ్‌గా లేనివారు, తదితర కారణాలు చూపుతూ సంఘాల ప్రక్షాళనకు రంగం సిద్ధం చేశారు. మండలంలోని 27 పంచాయతీలకు సంబంధించి 885 సంఘాలున్నాయి. 9,156 మంది సభ్యులు ఉన్నారు. వారి సమగ్ర వివరాలను సంఘమిత్రలు ఎస్‌హెచ్‌జీ ప్రొఫైలింగ్ యాప్ ద్వారా నమోదు చేయనున్నారు. బ్యాంక్ ఖాతా, ఆధార్, కుటుంబ సభ్యుల వివరాలు, వారు చేస్తున్న పని, తదిరత సమాచారాన్ని సేకరించనున్నారు. ఒక్కో సంఘమిత్ర రోజూ రెండు సంఘాల సమాచారాన్ని సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. తద్వారా వార్షిక ఆదాయం ఎక్కువగా ఉన్న వారికి ప్రభుత్వ పథకాలు కోత పెట్టే యోచనలో సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే ఎంతోమంది లబ్ధిదారులు ఇబ్బందులు పడే అవకాశం లేకపోలేదని డీఆర్‌డీఏ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి.

నెలాఖరులోగా ప్రక్రియ పూర్తి




మహిళా సంఘాలు ఏర్పడి చాలా ఏళ్లవుతోంది. మహిళా సంఘాల్లో ఎంతోమంది స్థానికంగా లేరు. అలాగే చాలామంది మరణించారు. వారి పేర్లను తొలగించి కొత్తవారికి అవకాశం కల్పించాల్సి ఉంది. ఈ క్రమంలోనే ప్యూరిఫికేషన్ కార్యక్రమానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ ఈ నెలాఖరు లోపు పూర్తి చేయనున్నాం.
–సుధారాణి, ఏపీఎం, గుడిపాల

మహిళా సంఘాలను ఏరివేసేందుకే..



మహిళా సంఘాలను ఏరివేసేందుకు ప్యూరిఫికేషన్ చేస్తున్నారు. ఇప్పటికే సంఘమిత్రలను రాజకీయ కక్షలతో తొలగిస్తున్నారు. వార్షిక ఆదాయాన్ని బట్టి సంఘాల్లోని సభ్యులను తొలగించి పథకాలు అందకుండా చేయాలని కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోంది. ప్రభుత్వం వద్ద ప్రతి ఒక్క సభ్యురాలికి సంబంధించిన డేటా ఉంది. కొత్తగా ప్యూరిఫికేషన్ చేయడం ఏమిటో అర్థం కావడం లేదు.
–కలైఅరసి, మాజీ ఎంపీటీసీ, నంగమంగళం

నిరుపయోగంగా వాటర్‌ట్యాంకు



పాన్నేడుపల్లెలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకు

తవణంపల్లె: మండలంలోని పాన్నేడుపల్లెలో లీకేజీతో వాటర్‌ట్యాంకు నిరుపయోగం మారింది. పాన్నేడుపల్లెలో ఇరవయ్యేళ్ల క్రితం గ్రామస్తులకు సౌకర్యంగా రక్షిత మంచి నీటి పథకం కింద 25 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకును నిర్మించారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో నాణ్యత లోపించి లీకేజీ అవుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. లీకేజీ కారణంగా గత ఏడేళ్లుగా వాటర్ ట్యాంకు నిరుపయోగంగా మారింది. దీంతో పరిసరాలు ముళ్ల చెట్లతో మూసుకుపోయాయి. ప్రస్తుతం తాగునీటి బోరు నుంచి పైపులైన్ల ద్వారా డైరెక్ట్‌గా సరఫరా చేస్తున్నారు. అధికారులు స్పందించి లీకేజీ అవుతున్న వాటర్ ట్యాంకును మరమ్మతు చేయాలని, సాధ్యం కాకుంటే కొత్తగా వాటర్ ట్యాంకును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.